సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం, 29, జూన్, 2025



ప్రతి హామీ అమలు

ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు అన్నారు.

వివరాలు 8లో ▸



1.24లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు 1.24 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /19.0

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇంటర్‌లో అడ్మిషన్లు పెంచాలి



మానవపాడు: గ్రామాల్లో ఇంటింటికి తిరిగి తప్పకుండా 120 అడ్మిషన్లు పూర్తిచేయాలని జిల్లా నోడల్ ఆఫీసర్ హృదయరాజ్ తెలిపారు. శనివారం మండలకేంద్రంలోని శ్రీ గంగు వెంకటకృష్ణరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలలో ప్రస్తుతం 60 అడ్మిషన్లు వచ్చాయని, తప్పకుండా మొత్తం 120 అడ్మిషన్లు పూర్తి చేయాలని సూచించారు. మానవపాడులో అడ్మిషన్ల సంఖ్య తక్కువగా ఉందని ఇటీవల నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులు అడిగారని, వారు కళాశాలపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. అదేవిధంగా కళాశాల గదిలో ఒక్కో సీసీ కెమెరా ఏర్పాటు చేస్తామని, విద్యార్థుల హాజరుశాతం ఎక్కువగా ఉండాలని సూచించారు. విద్యార్థులకోసం మానవపాడు, అమరవాయి, చెన్నిపాడు, జల్లాపురం, బోరవెల్లి తదితర గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తామని, డిపో మేనేజర్‌తో సోమవారం నుంచి బస్సులు తిరిగే విధంగా చూస్తామన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్స్‌పల్ పద్మావతి, వెంకటకృష్ణరెడ్డి, లక్ష్మణరావు, శ్రీనివాసులు, మహేందర్‌గౌడ్, ఫౌజియా, సతీష్‌కుమార్, కృష్ణ, బాలకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం

గద్వాల: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు.

చట్టబద్ధ రాజ్యాంగ సంస్థల దుర్వినియోగం



అలంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టబద్ధమైన రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తోందని సీపీఎం రాష్ట్ర నాయకులు ఆర్. శ్రీరాంనాయక్ అన్నారు. అలంపూర్ పట్టణంలో సీపీఎం రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. సీపీఎం రాష్ట్ర నాయకులు ఆర్. శ్రీరామ్ నాయక్, పిట్టల రవీందర్ హాజరై ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాజకీయ శిక్షణ తరగతుల్లో శ్రీరామ్‌నాయక్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలతో చట్టబద్ధమైన, రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలు విధ్వంసం అవుతున్నాయని విమర్శించారు. బీజేపీ 11 ఏళ్ల పాలన నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలతో రాజ్యాంగ వ్యవస్థలు ధ్వంసమయ్యాయని విమర్శించారు. బీజేపీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేవారిని ఇబ్బందులకు గురి చేస్తూ అణిచివేస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని ఏక కేంద్ర రాజ్యాంగంగా మార్చే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. అనంతరం రవీందర్.. మతం- మతోన్మాదం అనే అంశాలపై మాట్లాడుతూ.. దోపిడీని కొనసాగించడానికి మూఢ బావాలు పెంపొందిస్తున్నారని, ప్రజలు మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలన్నారు. పార్టీ కార్యకర్తలు సమాజంలో జరుగుతున్న అంశాలను శాస్త్రియ కోణంలో అధ్యయనం చేయాలని, ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, ఏ.వెంకటస్వామి, జి. రాజు, రేపల్లె దేవదాసు, జి కే.ఈదన్న, పరం జ్యోతి, మద్దిలేటి, నరసింహ, ఉప్పేర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరాలయానికి భక్తుల తాకిడి

బిజినేపల్లి: నందివడ్డెమాన్ జేష్ఠాదేవి సమేత శనేశ్వరాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనిదోష నివారణ కోసం శనేశ్వరుడికి తిలతైలాభిషేకాలు నిర్వహించేందుకు తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు.ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో శనేశ్వరుడికి తిలతైలాభిషేకాలు, గోత్రనామార్చనలు చేశారు. అనంతరం శివాలయాన్ని సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు శాంతికుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తి



ర్యాలంపాడు జలాశయాన్ని పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యం

- జూరాల జలాశయంలో డీసిల్టింగ్‌కు చర్యలు
- సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గద్వాల/ధరూరు: కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం కింద చేపట్టిన నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను డిసెంబర్ నాటికి పూర్తి చేయడంతో పాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జూరాల, నెట్టెంపాడు ప్రాజెక్టులను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా జూరాల గేట్ల మరమ్మతు, ర్యాలంపాడు జలాశయం లీకేజీలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జోగుళాంబ గద్వాల కలెక్టరేట్‌లో మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడారు. జూరాల ప్రాజెక్టు సాంకేతికపరంగా పూర్తి భద్రంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఉన్న 62 గేట్లలో 58 గేట్లు నిర్విరామంగా సురక్షితంగా పనిచేస్తున్నాయని.. మిగిలిన నాలుగు గేట్లకు అవసరమైన మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. గతంలో జూరాలకు 11 లక్షల క్యూసెక్కులకు పైగా వచ్చిన వరదను విజయవంతంగా ఎదుర్కొన్నట్లు గుర్తుచేశారు. అయితే జూరాల జలాశయంలో సిల్ట్ పేరుకుపోయిన కారణంగా నీటినిల్వ సామర్థ్యం 25 శాతం తగ్గిందని.. డీసిల్టింగ్ చేపట్టి జలాశయంలో పూర్తిస్థాయి నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం..

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన ఇంజినీర్లు, లస్కర్లు కూడా లేని దయనీయ పరిస్థితిలో తెచ్చిపెట్టారని విమర్శించారు. జూరాల డ్యాంపై నుంచి భారీ వాహనాల రాకపోకలు ప్రమాదకరమని నీటిపారుదలశాఖ అధికారులు నివేదికలు ఇచ్చినా.. వాటిని బుట్టదాఖలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలోనే పాత ప్రాజెక్టుల ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రాజెక్టుల నిర్వహణ కోసం 110 మంది ఇంజినీర్లతో పాటు 1,800 మంది లస్కర్లను నియామకం చేశామన్నారు. సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ.. పాత ప్రాజెక్టుల నిర్వహణ సక్రమంగా చేపట్టడంతో పాటు కొత్త ప్రాజెక్టులను పూర్తిచేసి బీడు భూములను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి వాకిటి

జూరాల ప్రాజెక్టు భద్రంగా ఉందని.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. ప్రతిపక్ష నాయకులు ప్రజల్లో అనవసరంగా ఆందోళన కలిగించే ప్రచారం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టుతో గద్వాల ప్రాంతం సస్యశ్యామలంగా ఉందన్నారు. ఈ ప్రాంతానికి సంబంధం లేని వారు అర్థంలేని అసత్యపు ప్రచారం చేస్తున్నారని.. పచ్చకామెర్లు వచ్చినవాళ్లకు లోకమంతా పచ్చగానే కనిపించినట్లు వారి మాటలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ.. జూరాల జలాశయంలో సిల్ట్ పేరుకుపోయి నీటినిల్వ సామర్థ్యం తగ్గిందని, పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, పర్ణికారెడ్డి, ఈఎన్‌సీ శ్రీనివాస్, సీఈ ప్రమీల, సత్యనారాయణ, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఈ రహీముద్దీన్ తదితరులు ఉన్నారు.

రూ.3.5 కోట్లతో మరో గ్యాంటీ క్రేన్..

జూరాల డ్యాం సేఫ్టీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న గ్యాంటీ క్రేన్‌కు అదనంగా రూ. 3.5 కోట్లతో మరో గ్యాంటీ క్రేన్ మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ర్యాలంపాడు జలాశయానికి ఏర్పడిన లీకేజీలకు పూర్తిస్థాయిలో మరమ్మతు చేస్తామన్నారు. అందులో నాలుగు టీఎంసీల నీటిని నిల్వ చేసి.. పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామని స్పష్టం చేశారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పనుల పూర్తికి అవసరమైన రూ. 500కోట్లు మంజూరు చేస్తామన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి కోరిక మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, ఆర్‌అండ్ఆర్, కెనాల్స్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి విజ్ఞప్తి మేరకు రామన్‌పాడ్ కింద డీ-6 పరిధిలో ఎమర్జెన్సీ క్రేన్, గేట్లు వంటి నిర్మాణాలు చేపడతామన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కోరిక మేరకు తుమ్మిళ్ల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామన్నారు.

వామ్మో దోమలు..



గద్వాలలో దోమలకు నిలయంగా మారిన కందకం

- ఇళ్ల మధ్య మురుగునీరే ఆవాసాలు
- పొంచి ఉన్న రోగాల భయం.. వణుకుతున్న జనం

గద్వాలటౌన్: ప్రస్తుత వర్షాకాలంలో దోమలు విజృంభిస్తున్నాయి. నిల్చున్నా.. పడుకున్నా.. దోమకాట్లు తప్పడం లేదు. దోమల సైర్వవిహారం ఎక్కువగా ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది. దోమల నివారణ చర్యలకు మున్సిపాలిటీ పరంగా ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా.. ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ప్రధానంగా ఫాగింగ్, కాలువల్లో దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు అప్పుడప్పుడు అధికారులు ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో కిందిస్థాయి సిబ్బంది పని తీరును పర్యవేక్షించకపోవడంతో పట్టణాలలోని కొన్ని ప్రాంతాల్లో దోమల బెడద ఏ మాత్రం తగ్గడం లేదు. ఈ ప్రాంతాల్లో డెంగీ వంటి ప్రాణాంతక జ్వరాలు, మలేరియా, చికెన్ గున్యా వంటి భయాలు ప్రజానీకాన్ని వెంటాడుతున్నాయి. జిల్లాలోని గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపల్ పట్టణాలలో ఇదే పరిస్థితి నెలకొంది.

పూడిక తీయకపోవడంతో..

ప్రధానంగా ఆయా పట్టణాలలోని కాలనీల్లో ఉన్న అంతర్గత కాలువలతో పాటు, కందకాలలో పేరుకపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గద్వాల పట్టణంలో సగభాగం కందకాలు విస్తరించి ఉన్నాయి. చాలావరకు ఆక్రమణకు గురయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి, చిన్న చిన్న కాలువల నుంచి వచ్చే మురుగునీరంతా కందకంలో కలుస్తున్నాయి. సక్రమంగా పూడిక తీయకపోవడంతో కందకాలన్ని చెత్త చెదారాలతో నిండిపోయ్యాయి. ప్రస్తుతం అడపదడపా వర్షాలు కురవటంతో ఈ కందకాల నుంచి నీరు దిగువకు పారేందుకు, సుంకులమ్మ మెట్టు వెనక భాగాన ఉన్న అవుట్‌లేట్ దగ్గర అనువైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఇటీవల పట్టణంలోని ప్రధాన డ్రైనేజీలలో చేపట్టిన పూడిక తీత పనులు నామమాత్రంగా సాగాయి. అయిజ, శాంతినగర్ వంటి పట్టణాలలో ప్రధానంగా మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు నిండుకున్నాయి. దాంతో మురుగునీరు పారకుండా అవి అడ్డుకుంటున్నాయి. పట్టణంలోని చాలా డ్రైయిన్లు పూడికతో నిండి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఏర్పడింది. నీరు ఎటూ కదలని పరిస్థితి నెలకొంటోంది. దాంతో ఎక్కడ నీరు అక్కడే నిలచిపోవటంతో దోమల ఉధృతి పెరిగిపోతోంది. గద్వాలలో ఓ మోస్తారుగా... మిగిలిన అయిజ, అలంపూర్, వడ్డేపల్లి పట్టణాలలో దోమల నివారణ చర్యలు మచ్చుకైన కనిపించవు.

కాల్వలను శుభ్రం చేయించాలి



దోమలను లార్వా దశలో ఉన్నప్పుడే నిర్మూలించే విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలి. సమస్యాత్మక ప్రాంతాలలో క్రమం తప్పకుండా యాంటీలార్వా ఆపరేషన్ చేయించాలి. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి. దోమల విజృంభణతో విషజ్వరాల భారిన పడే ప్రమాదం పొంచి ఉంది.

– శ్రీధర్, గద్వాల

దోమల నివారణ చర్యలు చేపడతాం



డ్రైనేజీలో పూడుకుపోయిన వ్యర్థ పదార్థాలను, ప్లాస్టిక్ కవర్లను తొలగించే చర్యలను ఇటీవల చేపట్టడం జరిగింది. దోమల నివారణ కోసం తగిన చర్యలు తీసుకుంటాం. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాం. కాలనీలలో ఫాగింగ్ యంత్రాలను వినియోగించడంతో పాటు దోమల నివారణ మందులను చల్లుతున్నాం.

– దశరథ్, కమిషనర్, గద్వాల

ఏడాదికి రూ.4 కోట్లపైనే..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ప్రతి నెల దోమల నివారణ మందుల వ్యాపారం రోజు రోజుకు విస్తరిస్తోంది. వర్షాకాలం మొదలైందంటే ఇది తారా స్థాయికి చేరుకుంటోంది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో సుమారు 30వేల కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబంలో ఎవరి స్థాయిని బట్టి సగటున నెలకు ఒక్కో కుటుంబం రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చు చేస్తోంది. ఇలా పట్టణాలలో దోమ మందుల వినియోగ వ్యయం ఏడాదికి రూ.4 కోట్లపైనే దాటుతోంది. ఇది కేవలం ఆయా కుటుంబాలు వ్యక్తిగతంగా ఏడాదికి చేస్తున్న ఖర్చు. వీటితో పాటు మున్సిపాలిటి దోమల సంహరణ కోసం లక్షల్లో ఖర్చు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే దోమల నివారణ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికి సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావుల చెర్వు గట్టు తిమ్మ ప్పస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి, శేషంపల్లి శివసీతారామస్వామి ఆలయాల్లోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, వాల్మీకి పూజరులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు సొబగులు

- కృష్ణాతీరంలోని సుందర ప్రాంతాలు, నల్లమలలో పర్యాటక అభివృద్ధికి రూ.68.10 కోట్లు
- సోమశిల, అమరగిరి, నార్లాపూర్ వద్ద కాటేజీల నిర్మాణం, బోట్ జెట్టీల ఏర్పాటు
- జటప్రోలు, కొల్లాపూర్‌లోని పురాతన ఆలయాల అనుసంధానం
- హోంస్టేల ద్వారా స్థానికులకు ఉపాధి, ఆదాయం

సండే స్పెషల్

ఒకవైపు పచ్చని నల్లమల అభయారణ్యం, మరోవైపు నీలిరంగు పులుముకుని ప్రవహించే కృష్ణమ్మ అందాలు, నదిలో ద్వీపపు సొబగులు, చుట్టూరా పురాతన ఆలయాలతో ఆధ్యాత్మిక శోభ.. వీటన్నింటినీ కలిపి టూరిజం సర్క్యూట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కృష్ణాతీరంలోని సోమశిల సర్క్యూట్‌ను ఏర్పాటు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేయనుంది. ఇందులో భాగంగా స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కి)కింద కేంద్ర ప్రభుత్వం రూ. 68.10 కోట్లను అందించనుంది. 'సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యూయల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్ట్' పేరుతో నల్లమల అటవీప్రాంతంతో పాటు సోమశిల ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు టూరిజం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

- సాక్షి, నాగర్‌కర్నూల్



సోమశిల వద్ద కృష్ణానదిలో సిద్ధమవుతున్న లాంచీ



కృష్ణానదిలో బోటులో విహారం చేస్తున్న పర్యాటకులు

సోమశిల నుంచి శ్రీశైలం వరకు బోటింగ్

కృష్ణానదిలో విహారం కోసం ఇప్పటికే పర్యాటకశాఖ లాంచీ ప్రయాణాన్ని కల్పిస్తోంది. వీటితో పాటు జాలరులు ప్రైవేటుగా బోటు విహారాన్ని కల్పిస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. వచ్చే నెలలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ క్రూయిజ్ ప్రయాణాన్ని పర్యాటకశాఖ అందుబాటులోకి తేనుంది. ఇందుకోసం ఇప్పటికే లాంచీ క్రూయిజ్‌ను సిద్ధం చేశారు. ప్రస్తుతం కృష్ణానదిలో నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే నెల నుంచి లాంచీ క్రూయిజ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లాంచీ అందుబాటులోకి వస్తే కృష్ణానదిలో ప్రకృతి రమణీయ దృశ్యాలను తిలకిస్తూ ఆరుగంటల పాటు నదిలో ప్రయాణించేందుకు వీలు కలుగనుంది.

ఎకో టెంపుల్ టూరిజం ఒకేచోట

కృష్ణానది తీర ప్రాంతాల్లోని సుందరమైన ప్రదేశాలైన సోమశిల, అమరగిరి ద్వీపం, నార్లాపూర్ గ్రామాల్లో కాటేజీలు, బోటింగ్ జెట్టీలు, వాటర్ స్పోర్ట్స్, కనెక్టింగ్ రోడ్లు, మౌలిక సదుపాయాలను కల్పిస్తారు. అలాగే నల్లమలలోని ఈగలపెంటలో అరైవల్ జోన్, రివర్ క్రూయిజ్, చెంచు ట్రైబల్ ఎక్స్‌పీరియన్స్ పేరుతో టూరిజం క్లస్టర్ ఏర్పాటు, కొల్లాపూర్‌లోని మాధవస్వామి ఆలయం, జటప్రోలులోని పురాతన మదనగోపాలస్వామి ఆలయాలను అనుసంధానిస్తూ టెంపుల్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తారు. సోమశిల సర్క్యూట్‌లోనే ఫారెస్ట్, ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు. ఇందుకోసం అమరగిరి ద్వీప ప్రాంతంలో 18 కాటేజీలు, బోటింగ్ జెట్టీలు, స్విమ్మింగ్‌పూల్, కేఫేటీరియా, స్పా అండ్ వెల్‌నెస్ సెంటర్, ఇన్‌డోర్, అవుట్ డోర్ గేమ్స్, వాటర్‌స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తారు. అలాగే కొల్లాపూర్ పట్టణంలోని రాజావారి ప్యాలెస్‌ను సైతం సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నారు. పురాతన భవనాల నిర్మాణ శైలితో పాటు బంగ్లాలోని పురాతన ఫర్నిచర్, అలనాటి వైభవం, నిర్మాణ ఆకృతులను దర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు.



కొల్లాపూర్‌లో రాజా వారి ప్యాలెస్

హోంస్టేల ద్వారా స్థానికులకు ఆదాయం..

సోమశిల కేంద్రంగా టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చెందితే మరింత విస్తృతంగా స్థానికులకు ఆదాయం సమకూరేందుకు అవకాశం కలగనుంది. ఇప్పటికే సోమశిలలో హోం స్టే విధానంలో తమ ఇళ్లను తీర్చిదిద్దుకున్నారు. పదుల సంఖ్యలో రిసార్ట్‌లతో పాటు వందకు పైగా ఇళ్లను హోంస్టేకు అనువుగా మలచుకున్నారు. తమ ఇళ్లలో ఉండేందుకు వసతులు కల్పించడంతో పాటు రుచికరమైన ఇంటి భోజనాన్ని పర్యాటకులకు అందిస్తున్నారు. ఆర్డర్‌పై చేపల పులుసు, కూరలు, రొట్టెలు, అన్నం ఇతర వంటకాలను పర్యాటకులకు అందిస్తున్నారు. సోమశిల గ్రామానికి వీకెండ్స్‌లో పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో నెలలో కనీసం 15 రోజుల పాటు స్థానికులు ఆదాయం పొందుతున్నారు. తమ ఇళ్లను హోంస్టేలుగా మార్చి అద్దెకు ఇస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

ప్రపంచస్థాయి టూరిస్ట్ డెస్టినేషన్‌గా అభివృద్ధి

ఒకే చోట ఫారెస్ట్, రివర్, ఎకోటూరిజం, టెంపుల్‌టూరిజం అభివృద్ధి చేసే అవకాశం దేశంలో ఎక్కడా లేదు. వీటన్నింటికీ అవకాశం ఉన్న సోమశిల ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి టూరిజం డెస్టినేషన్‌గా అభివృద్ధి చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. టూరిజం ద్వారా స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి, ఆదాయం కల్పించడంతో పాటు రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుంది.

– మంత్రి జూపల్లి కృష్ణారావు

రైలెక్కిన పొక్లెయినర్లు..



ఒకటి కాదు.. రెండు కాదు.. వందలాది పొక్లెయినర్లు రైలెక్కాయి. హైదరాబాద్ – మునీరాబాద్ – రాయచూర్ రైల్వే మార్గంలో దేవరకద్ర వద్ద శనివారం ఈ దృశ్యం కనిపించింది. వందలాది పొక్లెయినర్లను గూడ్స్ రైలుపై ఇలా రవాణా చేస్తుండగా ప్రజలు ఆసక్తిగా వీక్షిస్తూ.. తమ సెల్‌ఫోన్లలో బంధించారు. – దేవరకద్ర

క్లుప్తంగా

మరణంలోనూ వీడని బంధం

- రెండ్రోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతి



గడమల నర్సింహ (ఫైల్)



గడమల బాలమ్మ (ఫైల్)

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో రెండ్రోజుల వ్యవధిలోనే వృద్ధ భార్యాభర్తలు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గడమల నర్సింహ (70), గడమల బాలమ్మ (65) భార్యాభర్తలు. అనారోగ్యంతో నర్సింహ బుధవారం మృతిచెందగా.. దిగాలుతో భార్య బాలమ్మ శనివారం మృతిచెందింది. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గోపాల్‌పేట: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని పాటిగడ్డ తండాకు చెందిన పాత్లావత్ నార్యానాయక్(65) పంటను పందుల బెడద నుంచి కాపాడేందుకు శుక్రవారం రాత్రి పొలం చుట్టూ తీగలను ఏర్పాటు చేసి విద్యుత్‌షాక్ పెట్టి ఇంటికి వచ్చాడు. ఎప్పటిలాగా శనివారం ఉదయం పంటను చూసేందుకు వెళ్లాడు. వైర్లు తెగిపోయి పడి ఉన్నాయి. దీనిని గమనించకుండా తీగలపై రైతు కాలుపెట్టడంతో విద్యాదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉండగా అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

క్షణికావేశంలో మహిళ ఆత్మహత్య

నవాబ్‌పేట: క్షణికావేశంలో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండాపూర్‌లో చోటుచేసుకుంది. కొండాపూర్‌కు చెందిన పసుపుల శివలీల(35) కుటుంబ తగాదాలతో క్షణికావేశానికి లోనై ఉరేసుకొంది. మృతురాలి భర్త మల్లేశ్ తరచూ మద్యంతాగి భార్యతో గొడవ పడేవాడని.. శుక్రవారం గొడవ జరగడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొంది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి రాములు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. శివలీలకు కుమారుడు, కూతురు ఉన్నారు.

గొర్రెల మంద వద్దకు వెళ్తూ అనంతలోకాలకు..

బిజినేపల్లి: మండలంలోని వెల్లగొండకు చెందిన గొర్రెలకాపరి ఈర్ల మాసయ్య (65) శనివారం రాత్రి కొట్టాల్‌గడ్డ దర్గా సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. వెల్లగొండకు చెందిన ఈర్ల మాసయ్య వృత్తిరీత్యా గొర్రెలకాపరి. శనివారం చీకటి పడిన తర్వాత గొర్రెల మంద వద్దకు వెళ్లడానికి ఇంటి నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో కొట్టాల్‌గడ్డ వద్ద రోడ్డు దాటుతున్న అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు



మన్ననూర్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

మన్ననూర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణతో కలిసి మన్ననూర్‌లోని జంగాల కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. పలువురు లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం అటవీశాఖ విశ్రాంతి గృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో టీపీసీసీ అధ్యక్షుడు సమావేశమై మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహలక్ష్మి, గృహజ్యోతి, రైతుభరోసా తదితర పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉక్కు మహిళగా పేరుగాంచిన ఇందిరా గాంధీ పేరున పేదల సొంతింటి కలను సాకారం చేయడం గర్వంగా ఉందన్నారు. గుడిసెలు లేని గ్రామాలు ఉండాలన్నదే ఇందిరాగాంధీ ఆశయమన్నారు. అందుకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, మన్ననూర్ తదితర గ్రామాల్లో కోతులు అధికమై పంటలను నాశనం చేస్తుండటంతో రైతులు పంటల సాగుకు దూరమవుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణ టీపీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన.. ఈ ప్రాంతంలోని ఆదివాసీ చెంచులు, ఇతర వర్గాల వారికి వ్యవసాయపరంగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సాగులో ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం సబ్సిడీతో బోరు, సోలార్ విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. సాంకేతిక కారణాలతో రైతుభరోసా అందని రైతులకు త్వరలోనే వారి ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అయ్యేలా చూస్తామన్నారు.

■ ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అనే నినాదంతో ముందుకెళ్తున్నామని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పేదల సొంతింటి కల సాకారమవుతుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మాటలే తప్ప పేదలకు పక్కా గృహాలు కట్టించిన పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినారాయణ, డా.సురేశ్, పోశం గణేశ్, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు, రవి, బాలమ్మ, హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చత్రునాయక్, పవన్, రాజారాం, కృష్ణయ్య, రాజేంద్రప్రసాద్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జూరాలకు నిలకడగా వరద

- 1.24లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 12 క్రస్టు గేట్ల ఎత్తివేత
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- దిగువకు 1,15,978 క్యూసెక్కులు




జూరాల ప్రాజెక్టు వద్ద 12 క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో వరద పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు లక్షా5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం సాయంత్రానికి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో లక్షా 24వేల క్యూసెక్కులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 12 క్రస్టు గేట్లను ఎత్తి 86, 340 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 27, 790 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 43 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 290 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,15,978 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.571 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

11యూనిట్లలో 435 మెగావాట్ల ఉత్పత్తి

దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈమేరకు శనివారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 68.180 మిలియన్ యూనిట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 79.215 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 147.395 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

‘ఫేక్ మెసేజ్’తో రూ.57,700 మాయం



Texting with 076545 06501 (SMS/MMS)

Your SBIN a/c XXXXXXXX0635 is credited for INR 24000.00 on BOYA LAXAMMA 27-06-25 through.(NEF Ref ID 28635485626).

లక్ష్మికి పంపిన ఫేక్ మెసేజ్

అడ్డాకుల: ‘ఎల్‌ఐసీ డబ్బులు రూ.24 వేలు మీ బ్యాంకు ఖాతాలో జమ చేశాం.. మరో రూ.84 వేలు పంపిస్తాం’ అంటూ ఓ సైబర్ మోసగాడు రూ.57,700 కాజేశాడు. బాధితుడు మురళి కథనం మేరకు.. మండలంలోని పొన్నకల్‌కు చెందిన లక్ష్మి హైదరాబాద్‌లో నివసిస్తుండగా.. శుక్రవారం మధ్యాహ్నం మూసాపేటలో ఉండే తల్లి కొండమ్మ వద్దకు వచ్చింది. రూ.24 వేలు ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తప్పుడు సందేశం పంపించి ఫోన్ చేసి మాట్లాడాడు. రూ.24 వేలు ఎల్‌ఐసీ డబ్బులు జమ చేశామని.. మరో రూ.84 వేలు పంపిస్తామని, మరో బ్యాంకు ఖాతా నంబర్ పంపించాలని అడిగాడు. తనకు వివరాలు తెలియవని.. కుమారుడు శివకుమార్‌కు ఫోన్ చేయాలని అతడి నంబర్ చెప్పింది. తర్వాత శివకుమార్‌కు ఫోన్ చేసిన నేరగాడు వివరాలన్నీ చెప్పి ఖాతానంబర్ అడిగాడు. తన తల్లి మూసాపేటలో ఉంటుందని.. అక్కడ ఉండే ఆటో మెకానిక్ మురళి పేరు చెప్పి అతడికి ఫోన్ చేశాడు. ఎల్‌ఐసీ ఏజెంట్ డబ్బులు వేస్తాడు.. నీ బ్యాంకు ఖాతా వివరాలు అతడికి చెప్పమని కోరాడు. వెంటనే నేరగాడు మురళికి ఫోన్‌చేసి వివరాలు తీసుకుని మొదట అతడి ఖాతాలో ఉన్న రూ.7,700 కాజేశాడు. తర్వాత మురళి ఆత్మకూర్‌లో ఉండే తోడల్లుడు రాములుకు ఉదయం రూ.50 వేలు పంపడంతో దాన్ని గుర్తించి రాములు అకౌంట్‌కు వేస్తానంటూ అతడి నంబర్ తీసుకున్నాడు. రాములుకు ఫోన్‌చేసి గూగుల్ పే ద్వారా కొంత నగదు పంపినట్లుగా టైప్ చేయాలని కోరాడు. రాములు రూ.5000 టైప్ చేయగా వెంటనే అతడి బ్యాంకు ఖాతా నుంచి ఖాళీ అయ్యాయి. తర్వాత మిగిలిన రూ.45 వేలు కూడా కాజేశాడు. మొత్తంగా రాములుతో రూ.50 వేలు, మురళితో రూ.7,700 సైబర్ నేరగాడి పాలయ్యాయి. వెంటనే బాధితుడు మురళి మూసాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరంపై విచారణ చేయిస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.వేణు తెలిపారు.

బూర్గుపల్లిలో విషాదం

- గ్రామానికి చెందిన లా విద్యార్థి హైదరాబాద్‌లో హత్య
- అవయవదానంతో పలువురికి స్ఫూర్తి



శివప్రసాద్ (ఫైల్)

జడ్చర్ల: మండలంలోని బూర్గుపల్లిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కావలి శివప్రసాద్ (22) హైదరాబాద్‌లోని ఓ న్యాయ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుండేవాడు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని బల్కంపేటలోని ఓ అపార్ట్‌మెంట్ సమీపంలో కారు నిలిపే సమయంలో జరిగిన గొడవలో ఓ యువకుడు పదునైన ఆయుధంతో తలపై పొడవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే చికిత్స కోసం నిమ్స్‌కు తరలించగా ఈ నెల 27న బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ధ్రువీకరించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు తమ కుమారుడి అవయవాలు నలుగురికి ఉపయోగపడాలన్న సదాశయంతో అవయవ దానానికి అంగీకరించారు. దీంతో శనివారం రెండు కిడ్నీ లు, కాలేయం, ఊపిరితిత్తులను సేకరించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో అంబులెన్స్‌లో బాదేపల్లి రాజీవ్‌నగర్ కాలనీలో ఉంటున్న ఇంటికి అక్కడినుంచి స్వగ్రామం బూర్గుపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఒక్కగానొక్క కు మారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు మహాలక్ష్మి, నర్సింహులు కన్నీరు మున్నీరయ్యారు.

పాలమూరు బయోసైన్స్‌లో మళ్లీ తనిఖీలు!

భూత్పూర్: మండలంలోని కర్వెన, మద్దిగట్ల శివారులోని పాలమూరు బయోసైన్స్ లిమిటెడ్‌లో శనివారం తనిఖీలు జరిగినట్లు తెలిసింది. కుక్కలు, కోతులు, పందులు, మేకలపై అశాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు చేస్తున్నారని పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్మెంట్ ఆఫ్ యానిమల్స్ (పీఈటీఏ) ఫిర్యాదు చేయగా.. ఈనెల 16న భూత్పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి నియంత్రం, పర్యవేక్షణకు చెందిన ఆరుగురు సభ్యులతో కూడిన బృందం మళ్లీ పాలమూరు బయో సైన్స్‌లో తనిఖీలు చేసి జంతువుల పరిస్థితులను పర్యవేక్షించినట్లు తెలిసింది.

నారుమడిలో యాజమాన్య పద్ధతులు

- జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి
- విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



బిజ్జారం శివారులో వానాకాలం కోసం వేసిన నారుమడి

పాడి-పంట

జిల్లా వ్యవసాయాధికారి, జాన్‌సుధాకర్

కోస్గి: అధునాతన వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ.. విత్తన శుద్ధి చేసి తగు జాగ్రత్తలతో వరి నారుమడి వేసుకుంటే అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్ సూచిస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వరిసాగు చేసే రైతులు నారు పోసుకునేందుకు కరిగెట్టు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది వానాకాలంలో ప్రధానంగా బీపీటీ, తెలంగాణ సోనాతో పాటు వివిధ రకాల సన్న రకం వరి విత్తనాలను సాగు చేసుకోవడంతో దిగుబడి బాగుండడంతో పాటు ధాన్యం అమ్ముకునే విషయంలో ఇబ్బందులు ఉండవన్నారు.

విత్తన శుద్ధి..

నారు పోసే ముందు విత్తన శుద్ధి చేస్తే పలు రకాల కీటకాలు, తెగుళ్ల ఆశించకుండా నివారించుకోవచ్చు. కిలో విత్తనాలను 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకు తినే పురుగు, ఉల్లికోడు, మువ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి.

నారుమడి తయారీ..

- నారు పోయాల్సిన మడిని 10 నుంచి 12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా ఎత్తుగా నారుమడులు తయారు చేసుకోవాలి.
- ఎకరా పొలం నాటడానికి 5 సెంట్లు (500 చదరపు మీటర్లు) నారుమడి అవసరం. సెంటు భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి.
- 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.
- సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులను వాడితే తక్కువ ఖర్చుతో పాటు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చు.

నారులో కలుపు నివారణ

- నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారీ చేయాలి.
- విత్తిన 10 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 150 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనో క్రోటోపాస్ 1.6 మి.లీ మందును లీటర్ నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు పిచికారి చేయాలి.
- విత్తిన 15 రోజులకు సైహాలోపాస్ బ్యూబైట్ 10 శాతం మందు 400 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ పాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- నారు 20 నుంచి 25 రోజుల వయస్సున్నప్పుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది.

నాటు వేసుకునే విధానం...

నాటు వేసే నారులో ఆకు లేతగా, ఆకుమచ్చగడ ఉంటే చేసు తొందరగా తిరుగబెడుతుంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి వానాకాలంలో చదరపు మీటర్‌కు 44 దంట్లు (నారు మొలకలు) ఉండేలా నాటుకోవాలి.



బైక్‌పై పిల్లలతో ఉపాధ్యాయుడు గాజుల వెంకటేశ్

ఆ ఉపాధ్యాయుడు.. ఆదర్శప్రాయుడు

తను పనిచేసే ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చదివిస్తున్న వెంకటేశ్

సర్కారీ బడుల్లో పిల్లలను చేర్పించాలంటూ గ్రామాల్లో ప్రచారం చేస్తున్న చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులు.. వారి పిల్లలను మాత్రం ప్రైవేట్‌లో చదివిస్తున్నారు. కానీ ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు గాజుల వెంకటేశ్ మాత్రం తన పిల్లలను తాను పనిచేసే పాఠశాలలోనే చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈయన నిత్యం తనతోపాటు ఇద్దరు పిల్లలను అచ్చంపేట నుంచి బైక్‌పై తీసుకొచ్చి ఇక్కడి చదివిస్తుండటంతో స్థానికుల్లో నమ్మకం ఏర్పడి తమ పిల్లలను కూడా అదే పాఠశాలకు పంపిస్తున్నారు. ఒకప్పుడు 20 మంది విద్యార్థులు కూడా లేని ఈ పాఠశాలలో ప్రస్తుతం 90 మంది ఉన్నారు. వెంకటేశ్ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ బోధిస్తుండటంతో ఐదేళ్లలో 49 మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపికయ్యారు. దాతల సాయంతో ప్రొజెక్టర్, కలర్ ప్రింటర్ ఇతర పరికరాలు సమకూర్చుకొని విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌తో పాటు కంప్యూటర్ బోధన అందిస్తున్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాదులు వేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేష్ కృషిని అందరూ అభినందిస్తున్నారు. - ఉప్పునుంతల

జనాభాలో అధికులకే అన్యాయం



పీయూ విద్యార్థులతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, మాజీ డీజీపీ పూర్ణచంద్రారావు

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు
- పీయూలో ఆలిండియా ఓబీసీ విద్యార్థుల సంఘం సెమినార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జనాభా అత్యధికంగా ఉన్న బీసీలకే అన్యాయం జరుగుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఆలిండియా ఓబీసీ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సెమినార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జనాభాలో అధికభాగం ఉన్నప్పటికీ వారికి రాజకీయంతోపాటు ఏరంగాల్లో కూడా న్యాయం జరగడం లేదన్నారు. 42శాతం ఉన్న బీసీలకు అదే దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కల్పించాలని, ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. హక్కులు సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. పాలమూరులో గతంలో పని చేయడం గొప్ప అనుభూతని, ఇక్కడి ప్రజలు చాలా మంచి వారని పేర్కొన్నారు.

■ మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. పాలమూరులో మంచి మనుషులు ఉన్నప్పటికీ ఇక్కడ పరిస్థితి మాత్రం చాలా దారుణంగా ఉందన్నారు. బీసీలే కాదు ముస్లింలు కూడా దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొరు. ఎస్సీ, ఎస్టీల జనాభాకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉన్నా.. రాజకీయంగా నామమాత్రపు పరిస్థితులు ఉన్నాయన్నారు. వారికి నిజమైన రాజకీయ అధికారం లేదని, దీనిపై తాను పొలిటికల్ ఇన్వెస్టిగేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ పేరుతో ప్రభుత్వం రిజర్వేషన్లు తీసుకొచ్చిందని, అది కేవలం కమ్మ, రెడ్డి, వెలమ రిజర్వేషన్లు అని, తమిళనాడు తప్పా.. దేశంలో అన్ని రాష్ట్రాల్లో వీటిని అమలు చేశారని, ఇక్కడి కమ్మ, రెడ్లు ఎవరైనా రిజర్వేషన్ కోసం పోరాటం చేశారా అని, అలాంటప్పుడు రిజర్వేషన్లు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. సీఎం, పీఎం, డీజీపీ, చీఫ్ సెక్రటరీ పోస్టులు ఎప్పుడో ఓసీలకు రిజర్వు అయ్యాయని, అటువంటప్పుడు రిజర్వేషన్ ఇవ్వడం ఎందుకని విమర్శించారు. రాజ్యాంగంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని లేదని, 4శాతం ఉన్న రెడ్లు 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, బీసీల పరిస్థితి అలా లేదని హక్కుల సాధనకు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కుమారస్వామి, భూమయ్య, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు భరత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యం కేసు నమోదయినట్లు ఎస్సై గోవర్ధన్ శనివారం తెలిపారు. మండల పరిధిలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన రమేష్ ఈ నెల 5న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రమేష్ తల్లి తిరుపతమ్మ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒండ్రు మట్టి తరలింపు అడ్డగింత



ఒండ్రుమట్టి తరలిస్తున్న టిప్పర్లకు అడ్డంగా కారు నిలిపిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువు నుంచి తరలిస్తున్న ఒండ్రుమట్టిని మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శనివారం అడ్డుకున్నారు. కాంగ్రెస్ పాలనలో అక్రమ సంపద కోసం చెరువులోని ఒండ్రు మట్టిని సైతం వదలడంలేదని ఆరోపించారు. వెంటనే పనులు నిలిపివేయాలని జిల్లా ఇరిగేషన్ అధికారి బ్రహ్మానందంకు సూచించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులు, వాగుల నుంచి ఇసుక తరలిస్తూ అధికార పార్టీ నాయకులు డబ్బులు వెనకేసుకుంటూ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని అన్నారు. ధన్వాడ పెద్ద చెరువుకు నీరు తీసుకువస్తామని, ఇందు కోసం నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో డీపీఆర్‌లో చేర్చమని చెప్పుకొని తిరుతున్నారని, కానీ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌లో ధన్వాడ పెద్ద చెరువుకు నీరు తీసుకువచ్చేందుకు ఎలాంటి ప్లాన్ లేదని అన్నారు. కేవలం ఒండ్రు మట్టి తరలించుకునేందుకు ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. పెద్ద చెరువుకు నీటిని తరలించేందుకు పైపులైన్ నిమిత్తం రూ.100 కోట్ల బిల్లులు పెట్టారని, ఇది సాధ్యం కాదని వారికి కూడా తెలుసని అన్నారు. వెంటనే పనులు నిలిపివేయాలని చెప్పి ఒండ్రు మట్టి తరలించే వాహనాలను చెరువులో నుంచి బయటకు పంపించివేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అమ్మకోల్ల శ్రీనివాస్, కొండారెడ్డి ఉన్నారు.